ఈ వారం కథ

"ఒక్క క్షణం ఆలస్యమైతే ఏం జరిగి వుండేదో తెలుసా కుసుమా" అంటూ ఎత్తుకున్న మూడేళ్ళ బాబును అప్పుడే ఇంట్లో నుంచి వచ్చిన కుసుమ చేతికందించాడు ప్రకాష్.

చాలా మామూలుగా బాబును తీసుకుని వేగంగా దూసుకుపోతున్న లారీ వైపు చూస్తూ ఒక్కసారి గుండెలకత్తుకుంది కుసుమ.

"రోడ్డు పక్కనున్న ఇంట్లో వుండేటప్పుడు చాలా జాగ్రత్తగా వుండాలి. అందులో పిల్లల్ని మరీ జాగ్రత్తగా చూస్తుండాలి" అంటూ.

ఎత్తుకున్న బాబు క్రాఫ్‌ను సరి చేస్తున్న కుసుమకు ఎదురుగా వచ్చి "కుసుమా! నేను మార్కెట్‌కి వెళుతున్నాను ఏమైనా తీసుకురమ్మంటావా?" అని అడిగాడు ప్రకాష్.

"మధ్యాహ్నం చెప్పాను కదా! అవే తీసుకురండి!" అంది భుజం మీద బాబును జోకొడుతూ.

"అవి కాకుండా ఇంకా ఏమైనా మర్చిపోయినవి వుంటాయేమోనని" అంటూ తన రూమ్‌లోకి వెళ్ళి వైరు బుట్ట తీసుకుని బయటకు వచ్చి "నేను వెళుతున్నాను" అని రోడ్డు వైపు దారి తీశాడు.

కుసుమ బాబుతో ఇంట్లోకి వెళ్ళింది.




కుసుమకు పాతికేళ్ళుంటాయి. సహజ సౌంద ర్యవతి. గత నాలుగు సంవత్సరాల నుండి అదే ఇంట్లో అద్దెకు వుంటోంది మూడేళ్ళ బాబుతో. ఆ టౌన్‌లోనే ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో ప్రూఫ్ రీడర్‌గా పని చేస్తుంది. వయసు చిన్నదైనా జీవితంలో అనేక ఆటుపోట్లకు తట్టుకోవటాన ఎప్పుడూ ధైర్యంగా వుంటుంది.

ప్రకాష్‌ది చాలా సున్నిత మనస్తత్వం. ఎవరైనా తన ఎదురుగా కాలుజారి మురికి గుంటలో పడితే ఆ పడిన వారిని చూసి అందరూ నవ్వుతారు. కాని ప్రకాష్ మాత్రం అలాంటి వారిని చూసి జాగ్ర త్తగా పట్టుకుని లేపి వారి చేత శుభ్రంగా స్నానం చేయించి పంపేవాడు. ఇతరుల బాధలను తన బాధలుగా భావించి ఫీలయ్యేవాడు. ఇలాంటి పనుల వల్ల కొందరి చేత పిచ్చివాడని కూడా అనిపించు కున్నాడు.

పది నెలల క్రితం చాలా విచిత్రంగా ప్రకాష్ కుసుమ మాట్లాడుకున్నారు. వారికి రెండు పోర్షనుల అవతల పోర్షనులో వుండే స్కూలు మాస్టారుగారి పాప మట్టితో చేసిన బొమ్మతో ఆడుకుంటూ దానిని జారవిడిచింది. ఆ బొమ్మ పగిలి పోగా పగిలిన ముక్కలను చూస్తూ ఏడుస్తూ కూర్చుంది. అటుగా వచ్చిన ప్రకాష్ ఆ పాప ఏడుపును చూడ లేక ఆ ముక్కలను అతికించి ఇవ్వటం కోసం నానా తిప్పలు పడుతున్నాడు. అది చూసిన కుసుమ వస్తున్న నవ్వును ఆపుకోలేక పెద్దగా నవ్వేసింది.

అది ప్రకాష్ విని "ఏంటండీ! అలా నవ్వుతారు!" అన్నాడు కొంచెం విసుగ్గా కుసుమ వైపుచూస్తూ.

"మీ వ్యర్థ ప్రయత్నం చూసి" అంది.

"ఇది వ్యర్థ ప్రయత్నమో ఏమోగాని ఆ పాప ఏడుస్తుండటం మాత్రం నేను చూడలేక" అన్నాడు ప్రకాశ్ వాటిని అతికించాలని ఇంకా ప్రయత్నం చేస్తూనే.

"అది మీ వల్ల కాదులెండి" అని పగిలిన ముక్క లను తీసుకుని ఆ పాప చేతికిచ్చి చెవిలో ఏదో చెప్పింది.

అంతే! ఆ పాప ఏడుపును ఆపి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

అది చూసిన ప్రకాష్ "ఏడుపును ఎలా మాన్పిం చారండీ!" అని అడక్కుండానే "వెరీ! వెరీ! థాంక్సండీ!" అన్నాడు.

"ఎందుకండీ! నేను బొమ్మను అతికించి ఇవ్వలే దుకదా!" అంది.

"ఆ పాప ఏడుపును ఆపారుకదా! అందుకని" అన్నాడు ప్రకాష్.

ఫరవాలేదన్నట్లు చూసి తన ఇంట్లోకి వెళ్ళిపో యింది కుసుమ.

ఆ రోజు నుండి ప్రకాష్, కుసుమల మధ్య చనువు పెరిగింది. స్వంత విషయాలలోనూ, ఒకరి అభిరుచులను మరొకరు తెలుసుకునేసరికి ఇద్దరి మధ్య అభిమానం మరింత బలపడింది. కుసుమను 'మీరు నుంచి 'నీవు' అనేదాకా ప్రకాష్ కుసుమపై పిచ్చి అభిమానం పెంచుకున్నాడు.

తను ఆఫీసు నుంచి సాయంత్రం అయిదు గంట లకే ఇంటికి వచ్చేవాడు. కుసుమ తన బాబును ఆ ఇంటి ఓనరైన పెద్దావిడకు అప్పచెప్పి వెళ్ళేది. ప్రకాష్ రాగానే ఆవిడ వద్ద నుంచి బాబును తీసుకుని ఆడించేవాడు. కుసుమ ప్రెస్ నుంచి వచ్చి ప్రకాష్ ఒడిలోనున్న బాబును చూసి నొచ్చుకుని 'అయ్యయ్యో ఎందుకండీ! మీకీ శ్రమ!" అని తీసుకోబోయేది.

కాని ప్రకాష్ మాత్రం ఇవ్వకుండా "మీరు వంట చేసుకోండి. ఫరవాలేదు అని కుసుమకు ఇవ్వ కుండా తనే ఆడించేవాడు. ఇది చూసి చుట్టు పక్కల వాళ్ళు గుసగుసలాడుకునేవారు.

ఒకసారి ప్రకాష్ తన మనసులోని మాటను "ఐ లవ్ యు" అని చెప్పేశాడు. కుసుమ మౌనంగా వుండిపోయింది.

ఆ మౌనం అంగీకారమో లేక ఇద్దరి మధ్య వున్న చనువు వల్ల తన నిరసన తెలియచేసి తనను బాధ పెట్టకూడదనే ఉద్దేశంతో మౌనంగా వుందో అర్థం చేసుకోలేకపోయాడు.

ప్రకాష్‌కి కుసుమ మనసులోని అభిప్రాయాన్ని తెలుసుకోవాలనే కుతూహలం ఎక్కువైంది. మళ్ళీ రెండు రోజుల తర్వాత "ఐ లవ్ యూ కుసుమా!" అన్నాడు ప్రేమగా చూస్తూ.

కుసుమ ఎలాంటి చలనం లేకుండా వుండి పోయింది. ఆమె ముఖంలోని గంభీర భావనని చూశాడు. "అందుకే నిజం కుసుమా! నీ గతమంతా నాకు తెలుసు. అదంతా ఒక పీడకలలా మరచి పోదాం. మనమిద్దరం కలసి జీవిద్దాం" అన్నాడు ఎంతో ఉద్వేగంగా.

చాలాసేపటికి 'ఐ లవ్ యు' అని కాకుండా 'ఐ లైక్‌యూ!" అని అంతకన్నా ఎక్కువ మాట్లాడ కుండా అటువైపు తిరిగింది.

ఆ మాట చాలనుకున్నాడు ప్రకాష్. ఆ సమ యంలో ప్రపంచాన్ని జయించినంతగా ఫీలయ్యాడు.

** ** **

ఆ రోజు ఓ ప్రెస్ కార్మికుడు చనిపోవటం వలన టౌన్‌లోని ప్రెస్‌లన్నిటికీ సెలవు ఇవ్వటంతో కుసుమ ఇంటి వద్దనే వుంది.

ప్రకాష్ సాయంత్రం అయిదు గంటలు కాగానే క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఇంటి ముందుకు వచ్చి వాలాడు.

కుసుమ ఇంట్లోకి తొంగి చూశాడు.

ఆశ్చర్యం.

ఇంట్లో తనకంటే రెండు మూడేళ్ళు ఎక్కువ వయసుగల గడ్డం పెంచిన పురుషుడు వున్నాడు. అతని కళ్ళు క్రౌర్యానికి మారుపేరులా వున్నాయి. శరీరమంతా ఏదో అధికారం ఆవహించిన వాడిలా వున్నాడు. బాగా పరీక్షించి చూడగా కుసుమ కొడుకు పోలికలు కొద్దిగా కనిపించాయి.

అతడు బాబును దగ్గరకు తీసుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడు. బాబు భయం భయంగా చూస్తూ ఏడుస్తున్నాడు. బాబును ఎత్తుకునే సరికి గుక్కపెట్టి ఏడవటం మొదలు పెట్టాడు.

ప్రకాష్‌ను చూసి చెంగున అతని ఒడిలో నుంచి దూకి ప్రకాష్ దగ్గరకు వచ్చి కాళ్ళకు చుట్టుకున్నాడు. బాబును ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నాడు. భుజం మీద వాలి ఏడుపును ఆపుకోటానికి ప్రయత్నం చేస్తున్నాడు బాబు.

దానితో ఆ గడ్డం వ్యక్తి బయటకు వచ్చి ప్రకాష్ వైపు కోపంతో కూడిన కళ్ళతో ప్రశ్నార్థ కంగా చూశాడు.

కుసుమ కూడా బయటకు వచ్చి "పేరు ప్రకాష్! కలెక్టరు ఆఫీసులో పని చేస్తుంటారు. ఎదురు పోర్షనులో వుంటారు" అని చెప్పింది.

గడ్డం వ్యక్తి తీక్షణంగా ఓ చూపు చూశాడు ప్రకాష్ వైపు.

అందుకు కుసుమ ప్రకాష్ వైపు క్షమించమన్న ట్లుగా చూసింది.

కుసుమ ముఖంలోకి చూసి ఏదో చెప్పరాని బాధతో వున్నట్లు ప్రకాష్ గమనించాడు. ప్రకాశ్ దగ్గర నుంచి బాబును తీసుకుని లోపలికి వెళ్ళింది కుసుమ. అతను కూడా కుసుమ ననుసరించి లోపలికెళ్ళాడు.

"బాబూ! ప్రకాష్!" అనే మాట విని అటువైపు చూశాడు. ఇంటి ఓనరుగారి భార్య రమ్మన్నట్లు సైగ చేయటంతో వెళ్ళి "ఏంటండీ" అన్నాడు.

"ఆ దుర్మార్గుడు! అదే...కుసుమ భర్త మధ్యాహ్నం వచ్చాడు. వచ్చిన దగ్గర నుంచి దుబాయ్ వెళదాం! బయలుదేరమని ఒకటే పోరు పెడుతున్నాడు. కుసుమని అక్కడికి తీసుకెళ్ళి ఏం చేస్తాడో! ఏమిటో! బాబు!" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

ప్రకాష్‌కి కూడా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అక్కడ వుండలేక తన రూమ్ ముందు వున్న వసారాలో కుర్చీ వేసుకుని కూర్చున్నాడు.

కుసుమ ఇప్పుడు ఏం చేయాలని ఆలోచిస్తుంది? అతని వెంట వెళ్ళాలని ఆలోచిస్తుందా? అతడు భర్త అనే పదానికి అర్హుడు కాడు అని తనకు పరిచయమైన తొలి రోజుల్లోనే కుసుమ నోటి వెంట విన్నాడు. ఒకవేళ కుసుమ అతని వెంట వెళితే తను భరించగలడా!

'నో! అలా జరగటానికి వీల్లేదు. కుసుమ ఎప్పుడూ హాయిగా నవ్వుతూ తన ఎదురుగానే వుండాలి' అని అనుకుని వెళ్ళి కుసుమ ఇంటి తలుపు తట్టబో యాడు.

లోపల నుంచి పెద్దగా వినిపిస్తున్న మాటలు విని ఆగిపోయాడు. మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ప్లీజ్ కుసుమా! నా దగ్గరున్న నీ ఫోటో చూసి మా అరబ్ షేక్ మూర్ఛబోయాడు. నీవు ఆయన్ని తృప్తిపరిస్తే నీవు మహారాణిలాగా, నేను మహారాజు లాగా బతకొచ్చు" అని అర్థిస్తున్నట్లు వినిపించింది అతని గొంతు.

ఆ మాటలు విని "ఛీ! నీడింత దుర్మార్గుడా! అని ఛీదరించుకున్నాడు ప్రకాష్.

"నీవు ఈ ప్లాన్‌తో వచ్చావని తెలిస్తే అసలు ఇంట్లోకి అడుగు పెట్టనిచ్చేదాన్ని కాదు. భర్తగా కాక పోయినా మనిషిగానైనా నీ గౌరవాన్ని కాపాడుకో" అని కటువుగా పలికింది కుసుమ గొంతు.

"అయితే బాబును నాకివ్వు!" కఠినంగా అన్నా డతను.

"వాడికసలు నీ రూపే తెలియనివ్వను. వాడు ముమ్మూర్తులా నా గుణాలు గలవాడిగా పెంచుతాను బాబును నా నుంచి వేరు చేసే హక్కు నీకు లేదు"

"నాకు తెలుసే! నువ్విప్పుడు ఆ కుర్రాడిని పెట్టు కుని కులుకుతున్నావని ఇక్కడకు రాగానే చెప్పారు. ఏం వాడిని వదిలి రాలేకపోతున్నావా! నిన్ను నా వెంట ఎలా తీసుకెళ్ళాలో నాకు బాగా తెలుసు. నువ్వు ఏమన్నా వాడు నా కొడుకు. వాణ్ణి నేను తీసుకు వెళితే నువ్వు ఎలా రాకుండా వుంటావో చూస్తాను" అని ఏడుస్తున్న బాబును ఎత్తుకుని వడివడిగా ఇంట్లో నుంచి బయటకు వచ్చాడు.

"ఆగు! నా బాబును నాకిచ్చెయ్!" అంటూ కుసుమ కంగారుగా బయటకు వచ్చింది.

ప్రకాష్ అతడ్ని పట్టుకుని "మిస్టర్! నీవు నీ ఆనందం కోసం ఇతరుల్ని అందులో నీ భార్యని హింసిస్తున్నావంటే నీవు మనిషివి కావు. మర్యాదగా బాబును ఇవ్వు. బాబును నీవెప్పుడూ లాలించలేదు, బుజ్జగించలేదు. తల్లీ, తండ్రీ తానై పెంచుతున్న ఆమె నుండి బాబును వేరు చేయకు. మరీ నీ ఆగడాలు మితిమీరితే ఇక్కడి ఎస్.ఐ. నా క్లాస్‌మేట్. కిడ్నాప్ కేసు క్రింద నిన్ను అరెస్టు చేయించాల్సి వస్తుంది జాగ్రత్త!" అని బాబును లాక్కున్నాడు.

బాబు ప్రకాష్ మెడ చుట్టూ చేతులు వేసి కావలించుకుని గట్టిగా పట్టుకున్నాడు.

ప్రకాష్ చెప్పిన చివరి మాటకు ఖంగుతిన్న అతడు కుసుమ వైపు తిరిగి "నేను నీకు భర్తను కానప్పుడు నీ మెడలో నేను కట్టిన ఈ తాళిబొట్టు అనవ సరం" అని కుసుమ మెడలోని మంగళసూత్రాన్ని తెంచి తీసుకున్నాడు. కుసుమ అలా చూస్తూ వుండి పోయింది.

మీ అంతు చూస్తానన్నట్లుగా కుసుమ వైపు, ప్రకాష్ వైపు చూసి వడివడిగా వెళ్ళి పోయాడు.

కుసుమ తేరుకుని ఇంట్లోకి వెళ్ళింది.

ప్రకాష్ భోరున ఏడుస్తున్న బాబును ఎత్తుకుని జోకుడుతూ "లోపలికి రావచ్చా! కుసుమా!" అన్నాడు. ఏం మాట్లాడలేకపోయింది. కాసేపు ఆలోచించి లోపలికి ప్రవేశించాడు ప్రకాష్.

"బాధపడకు కుసుమా! ప్రేమించి చేసుకున్న నీ భర్త నిన్ను మోసగించాడు. ఇప్పుడు నా మనసులోని మాటను చెబుతున్నాను. నీవు నన్ను లవ్ చేయక పోయినా, లైక్ చేశావు. ఆ లవ్‌కీ, లైక్‌కీ మధ్య వున్న రేఖను తొలగించమని అడుగుతున్నాను. అదీ నీ కిష్టమైతేనే. మనం జీవితాంతం కలిసి జీవిద్దాం! అదీ నీ సమ్మతంతోనే!" అని తన భుజం మీద వాలి నిద్రపోతున్న బాబును కుసుమ చేతుల కందించి బయటకు రాబోయాడు.

గడప దాటుతుండగా "ఆగు ప్రకాష్! ఈ సమాజంలో మనిషి జీవించాలంటే తోడు అవసరం కావచ్చేమో! కాని ఆ తోడును భర్త అనే హోదాతోనే అందించక్కరలేదు. భార్యాభర్తల మధ్య సంబంధం మీద నాకు నమ్మకం పోయింది. కానీ నాకు నా మీద నమ్మకం వుంది. ఆ నమ్మకంతోనే నా జీవితాన్ని, నా బాబు జీవితాన్ని నేను సరిదిద్దుకోగ లను. ఇప్పుడు నీ రూపంలో ఇంకో భర్తను నేను భరించదలచుకోలేదు. అయితే మనిద్దరం ఎవరి ఇంట్లో వారు వుంటూనే స్నేహితుల్లా, సన్నిహిత స్నేహితుల్లా జీవిద్దాం అని చెప్పింది కుసుమ.

ప్రకాష్ తెల్లబోయి "మరి నలుగురూ నాలుగు రకాలుగా అనుకునే అవకాశం లేదా అప్పుడు" అన్నాడు.

"నా అభిప్రాయం నేను చెప్పాను. ఇక నీ అభి ప్రాయం నీ ఇష్టం" అంది కుసుమ మామూలు ధోరణితో.

ప్రకాష్‌కి ఏమీ అర్థంకాక ఏం చెప్పలేక అయోమ యంగా వాకిలి దాటి వచ్చేశాడు.